చేశారు. వాళ్ళ రాక్షస యజ్ఞంలో నేను ఓ సమిధనై బూడిదనై పోయాను. కాలిపోయాను.

ఓడిపోయాను. దారుణంగా ... వంచనతో ... దగా పడిన నిర్భాగ్యురాలిని నేను.

అన్నా

నేనూ, నాన్నా ఈ ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాం. చావడానికో, బతకడానికో తెలీదు.

నా ఉనికి తెలుసుకోవడానికి నువ్వు ప్రయత్నించకు. ప్రయోజనం ఉండదు.

నా కోసం నువ్వు బాధ పడతావని తెలుసు నాకు. అయినా వెళ్ళక తప్పదు.

ఇప్పటికే నువ్వు నా కోసం ప్రాణాలకి తెగించావు. నీకెంతో ఋణపడిపోయానో తెలుసా?

అన్నా! ఒక్క కోరిక. ఈ చెల్లెలి కోరిక తీరుస్తావా? నేననే దాన్ని నీకు గుర్తుంటే ఏ ఆడపిల్ల బతుకూ ఇలా అన్యాయం కాకుండా చూడు. కాపాడు. నువ్వు ఏ ఆడపిల్లకి సాయపడ్డా అది నువ్వు నాకు చేసిన సహాయం కిందే లెక్క. ఈ చెల్లి నీకు గుర్తున్నట్లే లెక్క.

**నాకు బతుకు మీద ఆశలేదు, తెగింపు తప్ప. నాకు ఎవరిమీదా మమకారం లేదు, పగ తప్ప.**

మతి చెడిన కన్నతండ్రి వెంట పిచ్చిదానిలా తిరుగుతానో లేక నా గుండెలో చెలరేగుతున్న ప్రతీకార జ్వాలలతో నా బతుకు నిలా చేసిన వాళ్ళని దహించడానికి **శక్తినే** అవుతానో తెలీదు.

-స్వర్ణ."

ఈశ్వర్ కళ్ళలో నీరు తిరిగింది.

ఆ ఉత్తరం రాసింది స్వర్ణ అని తెలీగానే మళ్ళీ కలవరం... అందరిలోనూ.

ఆ పిల్ల...

చిన్న పిల్ల ...

అభం శుభం తెలియని అర్భకురాలు. బలి పశువై పోయింది.

అలాంటి దౌర్భాగ్యం తమకి కలలో కూడా కలగకూడదని ఎవరికి వాళ్ళే మనసులో అనుకునే క్షణ మది.

చిత్ర మెల్లగా ఈశ్వర్ భుజంపైన చెయ్యి వేసింది.

"పద. వెళ్ళి చూద్దాం!" అంది.

"ఏముందని? ఏం మిగిలిందని?" నీరసంగా అన్నాడు ఈశ్వర్.

అతని చెయ్యి పట్టుకుని కారు దగ్గరికి నడిపించింది చిత్ర.

అతను ఏమీ మాట్లాడకుండా కారెక్కాడు.

ఈశ్వర్ బాధని అర్థం చేసుకున్న రాజు, **చలపతి, ముకుందం కారు ఎక్కి కూర్చున్నారు.**

ఇరవై నిముషాల్లో స్వర్ణ ఇంటి ముందు కారాగింది.

కారు దిగి ఆ ఇంటి కెదురుగా నిలబడ్డాడు ఈశ్వర్. రెండు చేతులతో జుత్తు పీక్కున్నాడు.

అతనికి దగ్గరగా తగులుతూ నిలబడింది చిత్ర.

ఎదురుగా తాళం వేసిన ఇల్లు.

గుండె కలుక్కుమంటోంది.

కేవలం కొన్ని రోజుల్లో ఎంత చరిత్రని సృష్టించుకొన్నది ఆ ఇల్లు

ఓ రోజు గుండు చేసి దిక్కులేని అభాగినిలా ఇంటి ముందు విసిరేశారు ఆ ఇంటి చిన్నారి తల్లి స్వర్ణని.

అది చూసి తట్టుకోలేని ఆ చిన్నారి తల్లి మాతృమూర్తి గుండె బద్దలై చనిపోయింది.

ఎంత భయంకర సత్యం అది?

గత రాత్రి ఆమెను వేశ్యగా మార్చడానికి ప్రయత్నం జరిగింది. అదీ తన కళ్ళ ముందు. అంతకన్నా దారుణం ఏం కావాలి?

అన్నీ వదులుకుని ఆ ఊరు తమకేమీ చెయ్యదన్న ఓ గుండె పగిలే నిజాన్ని తెలుసుకొని మతి తప్పిన తండ్రితో బయలుదేరిన ఆ చెల్లెలి పయనం ఎందాకా?

అస లెక్కడికి వెళ్ళగలదు?

తనలాంటి మనిషి అండదండలున్నప్పుడే నిలబడలేకపోయిన ఆ పిచ్చి తల్లి...

ఎక్కడ తప్పటడుగు వేస్తుందోననీ, ఏ వంచనకి గురి అవుతుందోననీ అతని గుండె విలవిలలాడిపోతోంది.

చిత్ర మృదువుగా అతని చేతిని నొక్కి, "బాధ పడుతున్నావా?" అంది.

అతను మాట్లాడలేదు. మాట్లాడ్డానికి ఏమీలేదు కూడా.

మెల్లగా కారు డోర్ తెరిచి ఎక్కి కూర్చున్నాడు ఈశ్వర్.

చిత్ర కారు స్టార్ట్ చేసింది. రాజా వాళ్ళు ఎక్కలేదు.

"ఎక్కడికి?" అడిగింది అతన్ని.

ఆమె మొహంలోకి చూశాడు ఈశ్వర్.

"నీ ఇష్టం!" అన్నాడు

కారు కదిలింది.

[సశేషం]

మినీకథ

# దయ్యం

అమావాస్య ముందు రాత్రి-

చిక్కని చీకటికి తోడు ఆకాశాన్ని హఠాత్తుగా ఆవరించిన మేఘాల ఉరుములు, మెరుపులు.

సన్నని తుంపరగా వాన ప్రారంభమయింది.

ప్రయాణం చేస్తున్నది తారు రోడ్డు మీదే అయినా - అడపా తడపా మెరుపుల్లా దూసుకుపోయే బస్సులు తప్ప, రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

బండి తొట్టిలో కూర్చున్న పావయ్య కొరడాతో ఎడ్లను అదిలించాడు. బండి వేగాన్ని పుంజుకొంది.

ఆ గూడు బండిలో ఉన్నది నేనూ, మా పాలికాపు పావయ్యా మాత్రమే. బండిలో మూలస్థానం ఆక్రమించుకొని వస్తున్న మూడు నువ్వుల బస్తాలు ఉన్నాయి.

పావయ్య అరుపులకూ, చరుపులకూ పరుగులెత్తిన ఎడ్లు కొంత దూరం పోయేసరికి మెత్తబడ్డాయి.

పావయ్య చలికి ముడుచుకొని కూర్చున్న నా కేసి తిరిగాడు.

"అబ్బాయిగారూ! పెమాదకరమైన సోటు దాటొచ్చేశాం. మన కిక బయం లేదు కాబట్టి నిజం సెప్తున్నాను. మనం దాటొచ్చిన రేవును పెదపర్తి రేవు అంటారు. సాలా యేళ్ళ కిందట యిక్కడ నూతిలో ఓ కడుపుతో ఉన్న ఆడది పడిపోయి సచ్చిపోయింది. అది దయ్యమై రాత్రుళ్ళు జనాన్ని అడ్డగొట్టి ఏడిపిత్తుందట.. ఒకళ్ళో యిద్దరో జడుసుకొని రక్తం కక్కుకొని సచ్చిపోయారట కూడా..."

"చాల్లే. ఇలాంటి కాకమ్మ కథలు నాకు చెప్పకు. ఈ రోజుల్లో ఇంకా దయ్యాలున్నాయంటే ఎవరు నమ్ముతారు?"

"మీ సదువు కున్నోళ్ళు నమ్మక పోవచ్చు గాని - నేను సాయంగా దయ్యాన్ని సూశా నబ్బాయిగారూ!"

పావయ్య చెవుతున్నది పూర్తి కాలేదు. ఇంతలో-

"దయ్యం బాబోయ్! నన్ను దయ్యం పట్టేసింది! వచ్చి రక్షించండి బాబోయ్!

"వెనక నుంచి పెద్దగా కేకలు వినిపించాయి.

"బాబయ్యా, బయం లేదు. ఆంజనేయ సోమి దండకం సదువుకోండి. దయ్యం పారిపోతుంది" అని బదులిస్తూనే పావయ్య మళ్ళీ ఎడ్లను తరమబోయాడు.

"పావయ్యా, బండి ఆపు!"

"పద్దబ్బాయిగారూ. మన కెందుకు? మనం పోదాం!"

నేను పావయ్య చేత బలవంతంగా బండి ఆపించి కిందికి దిగి బండిలోని టార్చి లైటు తీసి కేకలు వినిపిస్తున్న చోటికి ఫోకస్ చేశాను. సైకిలును నెడుతున్న ఓ మనిషి కనిపించాడు. అత నింకా ఆర్తనాదం చేస్తూనే ఉన్నాడు. నేను, నా వెనక పావయ్యా వేగంగా అతని దగ్గరకు పరుగెత్తాం.

"దయ్యం నా సైకిలును వెనక్కి లాగేస్తోంది. కొంచెం సైకిలు తొయ్యండి!" ఆ మనిషి వణికి పోతున్నాడు.

పావయ్య ఆ సైకిలును తోశాడు - నిజంగానే అది కదలడం లేదు. నేను కూడా చెయ్యి వేసినా ప్రయోజనం లేకపోయింది.

ఆ సైకిలు మనిషి ఏదో గొణుగుతున్నాడు. అతని దగ్గర ఏదో ఘాటైన వాసన.

నా కనుమానం వచ్చి హేండిల్ బార్ కేసి లైటు వేసి చూశాను. అతని చేతుల్లో రెండు బ్రేకులూ బిగిసి పోయాయి!.

అతనికి పట్టిన దయ్యం ఏమిటో నా కర్థమైంది.

"పద, పావయ్యా ఇక మనం వెళ్దాం. మనం వచ్చి చూడకపోతే - నువ్వెంత మందికి దయ్యం కథ చెప్పేవాడివో.." అన్నాను.

ఇంకా ఆ మనిషి మైకంలో సైకిల్తో కుస్తీ పడుతూనే ఉన్నాడు.

-పైడిపాల